




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 23 | సంచిక : 179 ది. 18-09-2024 | విజయవాడ | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ. 1/-


## వరద బాధితులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించిన సీఎం చంద్రబాబు

**విజయవాడ:సెప్టెంబర్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి)** వంద రోజుల పాలనలో విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటూ ముందుకెళ్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వరద బాధితులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. "భారీ వర్షాలు, వరదల కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు కట్టిస్తాం. ప్రతి ఇంటికి రూ.25వేలు ఆర్థిక సాయం చేస్తున్నాం. మొదటి అంతస్తులో ఉండే వారికి రూ.10వేలు, ఇళ్లలోకి నీళ్లు వచ్చిన వారికి రూ.10వేలు, చిరు వ్యాపారులకు రూ.25వేల చొప్పున పరిహారం ఇస్తాం. టూవీలర్స్‌కు రూ.3వేలు, మూడు చక్రాల వాహనాలకు రూ.10 వేలు చొప్పున ఇస్తాం. ఫిషింగ్ బోట్, నెట్ పాక్షికంగా డ్యామేజీ అయితే రూ.9వేలు, పూర్తిగా డ్యామేజీ అయితే రూ.20వేలు ఇస్తాం.

# మా ప్రభుత్వం ఎవరినీ బలి చేయదు

■ అందరికీ న్యాయమే చేస్తుంది ■ హెూం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ■ గత ప్రభుత్వం అక్రమ చర్యల వల్ల బలైన అమాయకులెందరో లెక్కగట్టలేం ■ ముంబయ్ సినీ నటి కేసులో ఎవరి పాత్ర ఉన్నా వదిలిపెట్టం ■ చట్టప్రకారమే దర్యాప్తు..ఆధారాలతోనే ఐపీఎస్ ల సస్పెన్షన్ ■ కుట్రలు పన్ని బోట్లను ప్రకాశం బ్యారేజ్‌పైకి వదిలారు ■ కౌంటర్ వెయిట్ లు ధ్వంసమై ఉంటే ప్రమాదాన్ని ఊహించగలమా? ■ ప్రకాశం బ్యారేజ్ వద్ద పడవల తొలగింపు పనుల పరిశీలన అనంతరం హెూంమంత్రి అనిత

**అమరావతి,సెప్టెంబర్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి)** ముంబయ్ నటి కేసులో ప్రభుత్వం ఎవరినీ బలిచేయలేదని..బాధిత మహిళకు న్యాయం చేస్తోందని హెూం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. చట్ట ప్రకారమే దర్యాప్తు వేగంగా జరుగుతుందని, లోతైన దర్యాప్తులో తేలిన ఆధారాలు పరిశీలించాకే ముగ్గురు ఐపీఎస్ అధికారులపై చర్యలు తీసుకోవడం జరిగిందని ఆమె స్పష్టం చేశారు. ఈ కేసులో ఎవరి పాత్ర ఉన్నా వదిలిపెట్టబోమన్నారు. గత ప్రభుత్వం పైశాచికత్వం వల్ల బలైన అమాయకులు లెక్కలేనంత మంది అని ఆమె తెలిపారు. మంగళవారం ఉదయం ప్రకాశం బ్యారేజ్ వద్ద పడవల తొలగింపు పనులను హెూం మంత్రి అనిత పరిశీలించారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి బోట్ల తొలగింపు పనులను పరిశీలించిన అనంతరం హెూంమంత్రి మాట్లాడుతూ.. కుట్రలు పన్ని బోట్లను ప్రకాశం బ్యారేజ్‌పైకి వదిలారన్నారు. ఎగువ నుంచి వచ్చిన 11.4 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వల్ల బరువైన పడవలు మరింత బలంగా వేగంగా వచ్చి ఢీకొని 17 టన్నుల బరువున్న బ్యారేజ్ కౌంటర్ వెయిట్ లు ధ్వంసమై ఉంటే ప్రమాదాన్ని ఊహించగలమా? అని ఆమె ప్రశ్నించారు. విజయవాడ ప్రజలు, ఎన్డీయే ప్రభుత్వం చేసుకున్న అదృష్టం వల్లే మరింత ప్రమాదం జరగకుండా అక్కడితో ఆగిపోయిందన్నారు. విశ్లేషకుల పేరుతో సోషల్ మీడియా ద్వారా అర్థం లేని అనాలసిస్ లు చేయడం తగదని



ప్రజల భద్రత పట్ల బాధ్యతతో మాట్లాడాలని హితవు పలికారు. ఉద్దేశపూర్వకంగా చేసినవి కాకపోతే 50 టన్నుల బరువున్న పడవలు ఎలా బ్యారేజ్ వద్దకు కొట్టుకుని వచ్చాయో విశ్లేషించుకోవాలన్నారు. ఎగువన 200 పడవలు ఉంటే ఈ పడవలే ఎందుకు కొట్టుకు వచ్చాయో చెప్పాలన్నారు. టీవీల ముందు కూర్చుని నిర్లక్ష్యంగా మాట్లాడడం సరికాదని హెూంమంత్రి అనిత పునరుద్ఘాటించారు.



## కోస్తా సమయం ఎడిటర్ పడాల అస్తమయం

**కాకినాడ, సెప్టెంబర్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి)** రాజమహేంద్రవరం కేంద్రంగా వెలువడుతున్న "కోస్తా సమయం" దినపత్రిక ఎడిటర్ పడాల వీరభద్రరావు మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంకు గురైన పడాల చికిత్స నిమిత్తం వారం రోజుల క్రితం రాజమహేంద్రవరం నుండి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ వారం రోజుల నుండి ఆసుపత్రిలోని మెడికల్ విభాగంలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో తుది శ్వాస విడిచారు. పడాల అల్లూరి సీతారామరాజు జాతీయ యువజన సంఘం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. అలాగే అల్లూరి విగ్రహాలను ప్రతిష్టించేందుకు ఎన్నో కార్యక్రమాలను చేపట్టారు. పడాల మృతి తీరని లోటని ఆయనతో సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దలు "పడాల" మరణం తమను ఎంతగానో బాధించిందని "ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్"నాయకులు ఆవేదన వ్యక్తం చేసారు.

# అక్టోబర్ 1 నుంచి నూతన మద్య విధానం అమలు..

■ గతంలో మద్యం దుకాణాల్లో సొంత బ్రాండ్లు ప్రవేశపెట్టారు ■ మద్యపాన నిషేధం చేస్తామని మాయమాటలు చెప్పారు ■ ప్రభుత్వ ఆదాయం గత పాలకుల జేబుల్లోకి వెళ్ళింది ■ ఎక్సైజ్ వ్యవస్థను భ్రష్టు పట్టించారు ■ మల్టీ నేషనల్ కంపెనీలు వెనక్కి వెళ్ళిపోయాయి ■ నూతన మద్యం పాలసీపై మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు

**విజయవాడ :సెప్టెంబర్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన మద్యాన్ని సరసమైన ధరలకు అందించేలా కొత్త ఎక్సైజ్ పాలసీని రూపొందించడం జరుగుతుందని మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు వెల్లడించారు. ఈ మేరకు కేబినెట్ సబ్ కమిటీలో సభ్యులైన మంత్రులు కొల్లురవీంద్ర, నాదెండ్ల మనోహర్, సత్య కుమార్ యాదవ్, కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం రాష్ట్ర సచివాలయం, 4వ బ్లాక్ లోని ప్రచార విభాగంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైన్స్, జియాలజీ %ఁ% ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా మద్య విధానాన్ని భ్రష్టు పట్టించారు. ఎక్సైజ్ వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్నారు. సెబ్ పేరుతో వ్యవస్థను విధ్వంసం చేశారు. 70 శాతం ఉద్యోగులను వారి అక్రమ మద్యం విధానాన్ని అమలు చేసేందుకు ఉపయోగించుకున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల పేరుతో మల్టీ నేషనల్ కంపెనీల బ్రాండ్స్ లేకుండా చేశారు. వారి సొంత బ్రాండులైన జె బ్రాండ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. 2019 ఎన్నికల్లో మద్యపాన నిషేధం అంటూ



మాయమాటలు చెప్పారు. ఆ తర్వాత దశల వారీగా మద్యం నియంత్రణ అంటూ మోసం చేశారు. సామాన్యుడు అప్పులు తెచ్చి, పుస్తులు అమ్మి మందు తాగే దుస్థితి తీసుకొచ్చారు. దీంతో మద్యం ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం వారి జేబుల్లోకి వెళ్లిపోయింది. డిప్యూటేషన్ మీద అర్హత లేని వ్యక్తిని తీసుకొచ్చి వ్యవస్థను భ్రష్టు పట్టించారు. వారి విధానంతో మల్టీ నేషనల్ కంపెనీలు వెనక్కి వెళ్లిపోయాయి. నాసిరకం మద్యం తాగి చాలామంది అనారోగ్యంపాలై మృత్యువాత పడ్డారు. కిడ్నీ సమస్యలు, పెరాలసిస్ వంటి సమస్యలతో మంచానపడ్డారు. డిస్టలరీస్ వ్యవస్థను కూడా వారి చేతుల్లోకి తీసేసుకున్నారు. గత ఐదేళ్లలో వారి అక్రమ మద్య విధానంపై ఎన్నో పోరాటాలు చేశాం. దాదాపు రూ.19 వేల కోట్ల నిధులు దారి మళ్లించారు. చాలామంది నాటుసారా, నాట్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, గంజాయి, డ్రగ్స్ కు అలవాటుపడ్డారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నూతన మద్య విధానంపై సీఎం ఆదేశాలతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ చేసి బెస్ట్ పాలసీలపై అధ్యయనం చేయడం జరిగింది. అప్పట్లో 1994లో అమలు చేసిన విధానం దేశానికే ఆదర్శంగా నిలిచింది. దానిని ఆదర్శంగా తీసుకుని 6 రాష్ట్రాల్లో నూతన పాలసీపై అధ్యయనం చేశాం. అక్కడి ప్రభుత్వ, ప్రైవేట్ మద్యం షాపులు, ప్రభుత్వ, ప్రైవేట్ కలిపి నడుపుతున్న మద్యం షాపుల విధానాలను అధ్యయనం చేశారు. సరసమైన ధరలకు నాణ్యమైన మద్యం అందించేలా ప్రపోజల్స్ ను రేపు కేబినెట్ ముందు ఉంచుతాం. డ్రగ్స్, వంటివాటిని నియంత్రించేలా, మత్తుకు బానిసలైన వారిని రక్షించేలా కొన్ని చర్యలకు నిధులు కేటాయించనున్నారు.

## పేద వారికి గూడు, కూడు, గుడ్డ నినాదంతో టిడిపి ఆవిర్భవించింది - ఎమ్మెల్యే పులివర్తి నాని

**చంద్రగిరి :సెప్టెంబర్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి)** పేదవారికి గూడు, కూడు, గుడ్డ నినాదంతో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చంద్రగిరి మండలం, రెడ్డివారి పల్లి పంచాయతీ, నాయి బ్రాహ్మణ కాలనీలో నూతనంగా నిర్మించిన ఎన్టీఆర్ గృహాలను ఎమ్మెల్యే పులివర్తి నాని మంగళవారం ప్రారంభించారు. లబ్ధిదారులకు పట్టాలను అందించారు. కాలనీకి చేరుకున్న ఎమ్మెల్యే నానికి కూటమి పార్టీల నాయకులు, ఎన్టీఆర్ గృహాల లబ్ధిదారులు అపూర్వ స్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు. వేద పండితులు ఆశీర్వచనాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. లబ్ధిదారులు నూతనంగా నిర్మించుకుని, మామిడి ఆకుల తోరణాలతో, అరటి మాకులతో అలంకరించుకున్న ఎన్టీఆర్ గృహాలను ఎమ్మెల్యే నాని శాస్త్రోక్తంగా ప్రారంభించి, లబ్ధిదారులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావ కర్త అయిన నందమూరి తారక రామారావు ఆశయ సాధనకు మా పెద్దాయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్విరామంగా కృషి చేస్తున్నట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇల్లు లేని వారు ఉండకూడదు అన్న లక్ష్యంతో ప్రతి ఒక్కరికి పక్కా భవనం ఎన్టీఆర్ గృహాల పేరిట మంజూరు చేస్తున్నట్లు తెలియజేశారు. గత ప్రభుత్వం నివాసాలకు యోగ్యం కానీ అటవీ ప్రాంతాలను, నీటమునిగే ప్రదేశాలను ఇంటి స్థలాలుగా కేటాయించిందని, అక్కడ ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా చేతులెత్తేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో జనావాసాలలో నివాసానికి అనుకూలమైన ప్రదేశాలను గుర్తించి ఇండ్ల స్థలాలను లబ్ధిదారులకు మంజూరు చేయనున్నట్లు వివరించారు.



పెద్దల అడుగుజాడల్లో నడుస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఇది ప్రజా ప్రభుత్వం అని, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తామని చెప్పుకొచ్చారు. చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు ఎలాంటి సమస్యలకు లోను కాకుండా, సంతోషకర జీవితాన్ని గడపటానికి చంద్రగిరి ఎమ్మెల్యేగా తాను అన్ని విధాల చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఎన్టీఆర్ గృహాల లబ్ధిదారులు, ఇతరులు పాల్గొన్నారు.

## ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం ర్యాలీ

**తిరుపతి సెప్టెంబర్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి)** రుయా ఆస్పత్రి ఆవరణములో ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం ర్యాలీ మంగళవారము నిర్వహించడం జరిగింది. రుయా ఆసుపత్రి ఆవరణములో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి ఏ చంద్రశేఖరన్, రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ జి.రవి ప్రభు ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి ఏ చంద్రశేఖరన్ మాట్లాడుతూ ప్రపంచ రోగుల భద్రత దినోత్సవం లో భాగంగా రోగికి అందించవలసిన పద్ధతులు గురించి రోగిని చూసుకోవలసిన రోగికి కావలసిన వైద్యం అందించడంలో చూపవలసిన శ్రద్ధ, బాధ్యతలు గురించి , వైద్యులకు, నర్సింగ్, పారామెడికల్ విద్యార్థులకు, అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ విధంగా రోగికి అందించవలసిన వైద్యంలో , తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి, ఎప్పటికప్పుడు వాళ్లకి కావలసిన వసతులను సమకూర్చడంలో , వైద్య సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండాలని, అదేవిధంగా వారి బంధువుల కూడా రోగికి అందుబాటులో ఉండినట్లయితే, మెరుగైన వైద్యం అందించవచ్చును, రోగికి భద్రతా వసతులు గురించి తీసుకోవలసిన చర్యలను ఎప్పటికప్పుడు వారికి అందుబాటులోకి తీసుకురావడం చాలా సులభతరం అవుతుందని ఈ సందర్భంగా రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ జి రవి ప్రభు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసూతి వైద్యశాల సూపరిటెండెంట్ పార్థసారధి రెడ్డి, డాక్టర్ రామాంజనేయులు హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్, నర్సింగ్ సిబ్బంది, వైద్య విద్యార్థులు, నర్సింగ్ మరియు పారామెడికల్ విద్యార్థులు తదితరులు మరియు పి ఆర్ ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.



## వరద బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణి



**జి.కొండూరు: సెప్టెంబర్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి)**మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ప్రోత్సాహంతో అక్షయపాత్ర స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో జి.కొండూరు మండలంలోని కుంటముక్కల గ్రామంలో వరద బాధితులకు మంగళవారం స్థానిక టీడీపీ నాయకులు నిత్యవసర సరుకు లు పంపిణి చేశారు.ఒక్కొక్కరికి సుమారు రూ.1500 ల ఖరీదు కలిగిన సరుకులు అందజేశారు.ఈ కార్యక్రమం లో మండల పార్టీ కార్యదర్శి లంక రామకృష్ణ వరప్రసాద్,ఎంపీటీసీ సభ్యురాలు సందిపాము జయలక్ష్మి, పార్టీ సీనియర్ నాయకులు సుకవాసి శ్రీహరి,గ్రామ సర్పంచ్ వంగూరు కుమారి కెనడి,లంక నాగేశ్వరరావు,మన్నం నాగేశ్వరరావు,గోళ్ళ శ్రీనివాసరావు ,వీఆర్వో రాజేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఇసుక లారీలపై కఠిన నిబంధనలు తొలగించాలి

## రాష్ట్ర ప్రభుత్వానికి ఇసుక లారీ యజమానుల వినతి



**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 17: (వార్తా ప్రభ ప్రతినిధి)** ఇసుక లారీలపై విధించిన కఠిన నిబంధనలను వెంటనే తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి పలువురు ఇసుక లారీల యజమానులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం విద్యాధరపురంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇసుక లారీల యజమానుల సంఘాల నాయకులు వడ్లమూడి వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి, అన్నే చిట్టిబాబు, గంగవరపు మురళి, సాంబిరెడ్డి , చుక్కాపు రమేష్, రత్తయ్య ,టి. పాపారావు తదితరులు మాట్లాడుతూ ఇసుక లారీలపై విధించిన ఐదు శాతం జీఎస్టీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇసుక లారీ కిరాయిలు ఎవరు ఇస్తారో, ఎప్పుడు ఇస్తారో, ఎక్కడ ఇస్తారో తెలియని రీతిలో ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయని అన్నారు. అలాగే ఇసుక రవాణా చేసే వాహనాలకు విధించిన డిపాజిట్లను వెంటనే రద్దు చేయాలని, రవాణా ఆలస్యమైతే విధించే జరిమానాలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. లారీ కిరాయిలు తదితర సమస్యలపై రాష్ట్ర భూగర్భ శాఖామాత్యుల సమక్షంలో రవాణా అధికారులు, కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు లారీ యజమానులతో చర్చలు జరపాలని వారు కోరారు. సమావేశంలో పెద్ద సంఖ్యలో ఇసుక లారీల యజమానులు పాల్గొన్నారు.

# రోడ్ల పాలవుతున్న స్వచ్ఛదనం - పచ్చదనం పథకం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రభుత్వం కోట్లు ఖర్చుపెట్టి సమస్త మానవాళిని కాపాడే మొక్కలను రోడ్ల పాలు చేస్తున్న అధికారులపై మండిపడుతున్న గ్రామస్తులు సుజాతనగర్ మండలం లొ ని కొమటిపల్లి పంచాయతి మర్రితండా గ్రామ నుండి లక్ష్మీదేవి పల్లి వెళ్లే దారి లొ పచ్చధనం స్వచ్ఛధనం పథకం పనిలో అధికారుల నిర్లక్ష్యం తేట తెల్లం అవుతుంది. ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి తెచ్చిన మొక్కలు రోడ్ కీ ఇరువైపులా నాటే కార్యక్రమం చేపడుతుంది కొంత దూరం వేసి కొన్ని మొక్కలు రోడ్ ప్రక్కన వదిలి వెళ్లి ప్రజా ధనం పంచాయతీ అధికారులు వృధా చేస్తూన్నారు . ఇలా చేయటం పట్ల అధికారుల ప్రభుత్వ పదకాల పట్ల ఎంత నిర్లక్ష్యం గా ఉన్నారో తెలుస్తుంది.గత ప్రభుత్వం హయాంలో కూడా కరెంటు లైన్ క్రింద చెట్లను నాటారు కరెంటు వైర్లకు తాకుతూన్నాయి అని కొట్టించారు వాటితో పాటు పర్యావరణ హాని కారక మొక్కలు వేసి వెళ్లారు హరిత హారం పేరుతో భారీ మొత్తంలొ ప్రభుత్వ ఖజానా ఖాళీ చేసారు. ఈ ప్రభుత్వం కూడా ఇదే పరిస్థితి నెలకొందని ఈ మొక్కలను రోడ్లపాలు చేస్తున్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు మానవాళిని కాపాడే మొక్కలను మనం కాపాడలేక పోతున్నామని అధికారులపై మండిపడుతున్నారు

# జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి)**కొత్తగూడెం,ఎంతో మంది త్యాగాలతోనే హైదరాబాద్ నిజాం సంస్థానం ఇండియన్ యూనియన్ గవర్నమెంట్ లో విలీనమైందని,1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజలకు స్వాతంత్రం సిద్ధించిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ అన్నారు.తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జిల్లా ప్రజలకు,పోలీసు అధికారులకు సిబ్బందికి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ముందుగా ఎస్పీ సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ రాష్ట్రం 1948 సెప్టెంబర్ 17న భారతదేశ యూనియన్ నందు విలీనమైన సందర్భంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు.నేటితో 77 సంవత్సరాలు పూర్తి చేసుకొని తెలంగాణ రాష్ట్రం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతున్నదన్నారు.తెలంగాణకు స్వాతంత్ర్యం సాధించడానికి కృషి చేసిన మహనీయుల సేవలు చిరస్మణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్స్ పంకజ్ పరితోష్ ఐపిఎస్,కొత్తగూడెం డిఎస్పి రెహమాన్,జిల్లా పోలీస్ కార్యాలయ ఏవో జయరాజు,డీసిఆర్బీ సీఐ శ్రీనివాస్,ఎస్బి ఇన్స్పెక్టర్ నాగరాజు,సిఐలు వెంకటేశ్వర్లు,కరుణాకర్,రమేష్,శివప్రసాద్,ఆర్ఐలు రవి,నరసింహారావు, లాల్ బాబు ఎస్సైలు,డిపిఓ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



# ఆదిత్య బధిరుల పాఠశాలలో ఆద్యా జన్మదినం సందర్భంగా దుప్పట్లు పంపిణీ




**హనుమాన్ జంక్షన్, సెప్టెంబర్ 17(వార్తాప్రభ)**ప్రముఖ వ్యాపారవేత్త, అన్నపూర్ణ ఏజెన్సీస్ అధినేత నూలు నరసింహారావు, ధనలక్ష్మీ దంపతులు మంగళవారం హనుమాన్ జంక్షన్ లోని ఆదిత్య బధిరుల పాఠశాలలోని విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే పాఠశాలలోని విద్యార్థులందరికీ విందు భోజనం ఏర్పాటు చేశారు. తన మనుమరాలు చిరంజీవి ఆద్యా ( సుధీర్, ప్రత్యూష దంపతుల కుమార్తె ) 2 వ పుట్టినరోజు సందర్భంగా ఆదిత్య పాఠశాలలోని విద్యార్థులకు ఈ ఏర్పాట్లు చేసినట్లు నరసింహారావు తెలిపారు. ఆదిత్య పాఠశాలలో ఆద్యా పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుజిని, ఆదిత్య ప్రిన్సిపాల్ ఆకుల వెంకట రమణ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కిసాన్ క్రాఫ్ట్ కు నాంది పలికింది తెదేపా ప్రభుత్వం

## ■ కిసాన్ క్రాఫ్ట్ ను సందర్శించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి



**పొదలకూరు సెప్టెంబర్ 17 (వార్తాప్రభ)** మండలంలోని ప్రభగిరిపట్నంలో వున్న కిసాన్ క్రాఫ్ట్ లో మంగళవారం సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా ఫ్యాక్టరీ యాజమాన్యం వారు సోమిరెడ్డికు సాదరంగా ఆహ్వానం పలికారు. తొలుత సోమిరెడ్డి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం చేశారు.అనంతరం ఫ్యాక్టరీలో తయారయ్యే వ్యవసాయ పనిముట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో సోమిరెడ్డి మాట్లాడుతూ కిసాన్ క్రాఫ్ట్ సంస్థ పొదలకూరు మండలానికే గర్వకారణం అన్నారు.గతంలో తాను వ్యవసాయ శాఖ మంత్రిగా వున్నపుడు ఈ సంస్థ ప్రారంభించ దానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించా నన్నారు.81 కోట్ల రూపాయల పెట్టుబడితో సంస్థను ప్రారంభించారని ప్రస్తుతం సంస్థ టర్నోవర్ 220 కోట్లన్నారు. రైతులకు అవసరమైన 1లక్ష 38 వేల 815 రకాల వ్యవసాయ పనిముట్లు ఈ సంస్థలో ఉత్పత్తి అవుతున్నాయన్నారు. ఇండియాలో మొత్తం 14 బ్రాంచిలో వున్నాయన్నారు. తాము వ్యవసాయ రంగానికి, రైతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని, ఇరిగేషన్ రంగాన్ని సర్వ నాశనం చేసిందన్నారు. వైసిపీ ప్రభుత్వంలో కనీసం ఒక్క ఎకరాలో అయినా భూసార పరీక్షల జరిగిన దాఖలాలు లేవన్నారు. అనంతరం కిసాన్ క్రాఫ్ట్ ఛైర్మన్ రవీంద్ర అగర్వాల్ మాట్లాడుతూ తమ సంస్థకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్న సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి మరియు సంస్థ సిబ్బంది కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ క్రాఫ్ట్ ఉద్యోగులు, సౌత్ ఆఫ్రికాకు చెందిన ఇంటర్నేషనల్ క్రికెటం

# వరద బాధిత టూ వీలర్స్ మెకానిక్ లకు గల్ఫ్ స్టార్ ఇంజనాయిల్స్ వితరణ



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి )**వరద బాధిత టూ వీలర్స్ మెకానిక్ లకు ఇంజనాయిల్ కంపెనీ వారు విజయవాడలో వరద ముంపు ప్రాంతాల్లో వెతికి వెతికి మంగళవారం చేయూతనందించారు.ప్రపంచ ప్రఖ్యాత గాంచిన ప్రముఖ ఇంజిన్ ఆయిల్ గల్ఫ్ స్టార్ కంపెనీ కి డిస్ట్రిబ్యూటర్ ఎస్ ఆర్ ఎమ్ ఎన్ ట్రేడర్లు యజమాని శ్రీనివాస రాజు స్వచ్ఛందం గా విజయవాడ వరద ల లో ఇబ్బంది పడుతున్న మోటార్ సైకిల్ మెకానిక్ సోదరులకు నిత్య అవసర వస్తువులు 5 కేజీ ల బియ్యం, 1 కేజీ కంది పప్పు, 1 కేజీ వంట నూనె ,500 గ్రాములు చింత పండు, 1 కేజీ గోధుమ పిండి, 200 గ్రాములు కారం, 100 గ్రాములు పసుపు, కిలో ఉప్పు , 2 సబ్బులు , అందించి వారి ఉదారతను మనసును చాటు కున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ అనూహ్య వరద వల్ల మోటార్ సైకిల్ మెకానిక్కులకూడా అపార నష్టం వాటిల్లిందని మెకానికల్ షెడ్డుల్లో ఉన్న ఇంజనాయిల్స్,బ్యాటరీలు విద్యుత్తు పరికరాలు నీట మునిగి వందలాది మంది బాధితులు ప్రభుత్వ సాయం కొసం ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే తనకు తోచిన చిరు సాయం అందించానన్నారు. దేవరకొండ రాజు బృందం త్వరగా ఈ సాయం అందించామని శ్రీనివాసరాజు తెలిపారు.ఈ కార్యక్రమంలో కిసాన్ క్రాఫ్ట్ ఉద్యోగులు, సౌత్ ఆఫ్రికాకు చెందిన ఇంటర్నేషనల్ క్రికెటర్ నికోలస్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.వరద

# బాధిత 500 కుటుంబాలకు. దుప్పట్లు టవల్స్ పంపిణీ



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ ప్రాంతాల్లో ఊహించని రీతిలో వచ్చిన వరద ముప్పు ప్రాంతాల్లో మరియు వరదల కారణంగా ముఖ్యంగా మన విజయవాడ లోని కొన్ని ప్రాంతాలలో అత్యంత ఘోరముగా చాలా మంది ప్రజలు నిరాశ్రయులు అయ్యారు. వారికి ప్రభుత్వం వారు , అనేక స్వచ్ఛంద సంస్థలు ఆహారము , పాలు , నీళ్లు వగైరా అందిస్తున్నారు.మేముసైతం అంటూ విజయవాడ శ్రీ మాసన్స్ ఆధ్వర్యములో. విజయవాడ నగరంలో మరియు మరికొన్ని ప్రాంతాల్లో వరద ముప్పికి గురైన కుటుంబాలకు. కొంత మంది నిర్భాగ్యులకైనాసహాయము అందించాలనే ఉద్దేశ్యముతో ఒక్కొక్క కుటుంబానికి 2 దుప్పట్లు , 2 బాత్ టవల్స్ తొ కూడిన దుస్తుల కిట్ లను వైయస్ఆర్ కాలనీలో గ్రౌండ్ ఫ్లోరులలో నివాసము ఉంటున్న 500 కుటుంబాలకు కాలనీ లో ఉన్న శ్రీ గౌతమ్ ఇంగ్లిష్ మీడియం స్కూలు వద్ద మంగళవారం పంపిణీ చేశారు.విజయవాడ శ్రీ మాసన్ వర్షిప్ఫుల్ మాస్టరు లింగిపిల్లి రామకృష్ణ , వర్షిప్ఫుల్ బ్రదర్స్ ఎం.వి. జగన్నాథ్ , పిళ్ళా రవి , పల్లా కిరణ్ కుమార్ , పోతుల హరికిషోర్ , ఎమ్ మల్లికార్జునరావు , వీరయ్య గుప్తా , సాయి వరప్రసాద్ , జి జనార్ధనరావు , ఎమ్ నాగేశ్వరరావు , నల్లాన సూర్యారావు.. వైయస్సార్ కాలనీ ఎంపీటీసీ.కే సత్యనారాయణ తదితరులు చేతులు మీదుగా అందజేశారు.

# పచ్చదనం, పరిశుభ్రత పట్ల ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలి

## ■ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉగ్ర



**కనిగిరి సెప్టెంబర్ 17 వార్తా ప్రభ ప్రతినిధి**కనిగిరి నియోజకవర్గం కనిగిరి పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవా ర్యాలీని శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి జండా ఊపి ర్యాలీలో పాల్గొన్నారు. కనిగిరి లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా కూటమి శ్రేణులతో కలిసి కేక్ కటింగ్ చేసి, రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. చర్చి సెంటర్ వద్ద భారీ మానవహారం చేపట్టారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి స్వయంగా చీపురుతో పరిసరాలను సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. పారిశుద్ధ్యం పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పరిశుభ్రత పట్ల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చేపట్టాలని, ప్రజలు భాగస్వాములై పల్లెలను పట్టణాలను పరిశుభ్రత దిశగా నడిపించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం విశ్వకర్మ జయంతి సందర్భంగా బ్రహ్మంగారి దేవస్థానంలో విశ్వబ్రాహ్మణ సోదరులు కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, విశ్వబ్రాహ్మణులు చేపట్టిన ర్యాలీ ప్రారంభించి వారితో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ,కూటమి నేతలు, తమ్మనేని శ్రీనివాసులు రెడ్డి, షేక్ ఫిరోజ్, అధికారులు టిడిపి శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



**ఆగిరిపల్లి, సెప్టెంబర్ 17 ( వార్తా ప్రభ)** విశ్వకర్మ జయంతి వేడుకలను మంగళవారం విశ్వబ్రాహ్మణులు ఘనంగా నిర్వహించారు. మండల విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు అరిగే పిచ్చయ్య చారి నేతృత్వంలో మండల కేంద్రమైన ఆగిరిపల్లి లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటం వద్ద పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని విశ్వబ్రాహ్మణ సోదరలు హాజరయ్యారు.

# రైతుల మనసు ఎరిగిన కుటుంబానికి మూడవసారి పట్టం



**విస్సన్నపేట సెప్టెంబర్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి)**స్థానిక మండలానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు ల్యాండ్ లార్డ్ ధర్మదాత దివంగత కుక్కడపు మోహనరావు కు గత టిడిపి ప్రభుత్వ పరిపాలనలో తిరువూరు ఏఎంసీ డైరెక్టర్ గా సేవలందించడం జరిగింది. 10 సంవత్సరాల క్రితం ఆయన తనయుడు నాటి టిడిపి పరిపాలనలో తిరువూరు ఏఎంసీ వైస్ చైర్మన్ గా రైతుల శ్రేయసే లక్ష్యంగా విజయపథంలో విధులు నిర్వహించేందుకు అడుగులు వేశారు. నేడు ముచ్చటగా మూడవసారి అదే రైతు కుటుంబంలో మలి విడత వైస్ చైర్మన్ గా రైతులు మనసు ఎరిగిన వైభవ్ జ్యుయలరీ అధినేత కుక్కడపు వెంకట నాగేశ్వరావు తెలుగుదేశం పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి తిరువూరు శాసనసభ్యులు కొలికిపూడి శ్రీనివాసరావు సిఫారసుతో పట్టం కట్టడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# స్వచ్ఛత హీ సేవా ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే కాగిత




**పెడన సెప్టెంబర్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛత హీ సేవ 2024 కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన ర్యాలీని మంగళవారం నాడు స్థానిక శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగకుమారి ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి బంటుమిల్లి రోడ్డు వరకు ప్రధాన రహదారి వెంబడి ఈ ర్యాలీ జరిగింది. పరిసరాల పరిశుభ్రతను కాపాడుకోవడంతో పాటు పచ్చని చెట్లను పెంచుతాము అనే నినాదాలను ర్యాలీలో పాల్గొన్న వారు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గోపాలరావు వైస్ చైర్మన్ కాజా మాజీ వైస్ చైర్మన్ రెహమాన్ బేగ్ (పూలబాబు ) మున్సిపల్ ప్రతిపక్ష నాయకురాలు మట్టా నాగపావని నాని కౌన్సిలర్లు కటకం ప్రసాద్ బాబూలాల్ పట్టణ టిడిపి అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య ప్రధాన కార్యదర్శి వాహబ్ ఖాన్ మున్సిపల్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం



**విజయవాడ వశ్చిమ సెప్టెంబర్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నేడు నవభారత నిర్మాత, భారతమాత ముద్దుబిడ్డ, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినోత్సవాన్ని పురష్కరించుకొని విజయవాడ భారతి నగర్, అన్అకాడెమీ కాలేజి లో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మాత్యులు వై సత్య కుమార్ , బీజేపీ స్టేట్ మీడియా ఇన్ ఛార్జ్, మరియు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పాతూరి నాగభూషణం హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు, అలాగే ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరాం , బీజేపీ నాయకులు లంకా దినకర్ , విజయవాడ ఈస్ట్ అసెంబ్లీ కన్వీనర్ పోతంశెట్టి నాగేశ్వరరావు , కాలేజీ యాజమాన్యం కొమ్మినేని వెంకటేష్, గిరి, వంశీ తదితరులు హాజరయ్యారు. కాగా ఆంధ్రా హాస్పిటల్ డాక్టర్.అచ్యుత బాబు మరియు వారి వైద్య బృందం పాల్గొన్నారు.

# భారత స్కాట్స్ అండ్ గైడ్స్ బేసిక్ శిక్షణా తరగతులు ప్రారంభం



**కాకినాడ సెప్టెంబర్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి)** జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్ ఆదేశాల మేరకు వివిధ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులకు భారత స్కౌట్స్ అండ్ గైడ్ బేసిక్ శిక్షణ తరగతులు ఘనంగా ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతులు మంగళవారం తుని మండలం దొండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమై ఈనెల 23వ తేదీ వరకు జరుగుతాయని భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ ఎంవివి.సత్యనారాయణ తెలిపారు.ఈ శిక్షణకు కోటనందూరు,తుని అర్బన్, రూరల్, శంఖవరం, ప్రత్తిపాడు రౌతులపూడి తదితర మండలం నుండి సుమారు 30 మంది గైడ్స్ 30 మంది స్కౌట్స్ శిక్షణ కొరకు ఉపాధ్యాయులు హాజరయ్యారని తెలిపారు.ప్రత్తిపాడులో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైజర్ బిఎస్ఎస్‌వి జగదీష్, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎస్.షంషాద్ బేగం, జిల్లా కమిటీ సభ్యులు ఏ. త్రిపుల ఎంబిఎం దేవి,రాష్ట్ర శిక్షణాధికారి శివ నాగిరెడ్డి, డిఎల్.నారాయణ, సుశీల పాల్గొన్నారు.

# జనవాణి లో అర్జీలు స్వీకరిస్తున్న ఎంపీ తంగెళ్ల ఉదయ్

**కాకినాడ, సెప్టెంబర్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి)**జనవాణీ కార్యక్రమంలో భాగంగా కాకినాడ పార్లమెంటు సభ్యుడు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ మంగళగిరిలో జనసేన కేంద్ర కార్యాలయంలో మంగళవారం అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు.వారు తెలిపిన సమస్యలు నమోదు చేసుకున్నారు.తక్షణం సమస్యలు పరిష్కరించేందుకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.



